సాక్షి
తిరుపతి
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



ప్రతి గడపలో సంతోషం

ప్రస్తుతం ప్రతి గడపలో సంక్షేమం, సంతోషం వెల్లివిరిస్తోందని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో



ఘనంగా వాసుదేవకుండ హోమం

పవిత్రోత్సవాల్లో భాగంగా పెంచలకోనలో గురువారం వాసుదేవకుండ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	25
చిత్తూరు	32	24
తిరుమల	29	21
గూడూరు	36	26
నగరి	34	25

న్యూస్‌రీల్

ప్రజల పండుగగా వెంకటగిరి జాతర



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగ హోదాలో ఈ ఏడాది ప్రజల పండుగగా నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతరకు సంబంధించి 28 మందితో పీస్ కమిటీ ఏర్పాటు చేసి తొలిసారిగా సభ్యులతో జాతర నిర్వహణపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరకు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వెంకటగిరి రాజా కుటుంబీకులు, ఎస్వీ బీసీ చైర్మన్ డాక్టర్ వీబీ.సాయికృష్ణ యాచేంద్ర సూచనలు, సలహాలు పాటిస్తూ సంప్రదాయాన్ని గౌరవిస్తూ మరింత మెండుగా జాతరను నిర్వహిస్తామన్నారు. అమ్మవారి దర్శనార్థం రూ.200, 500తో ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పోలేరమ్మతల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పులి ప్రసాద్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర

- జిల్లాలో 11,396 మంది లబ్ధిదారులు

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత మొత్తాన్ని శుక్రవారం విడుదల చేయనున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లాలో సొంతంగా ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ కలిగిన డ్రైవర్లకు ఏటా రూ.10 వేల చొప్పున అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 11,396 మందికి రూ.1,13,96,000 తమ ఖాతాల్లో జమచేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతల సమీక్ష సమావేశాలు

- హాజరుకానున్న విజయ్‌సాయిరెడ్డి



తిరుపతి మంగళం: తిరుచానూరు సమీపంలోని ఓ ప్రయివేటు హోటల్లో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు వైఎస్సార్‌సీపీ నేతల సమీక్ష సమావేశాలు జరగనున్నాయి. దీనికి వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ దక్షిణ, కోస్తా జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ విజయ్‌సాయిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులతో ఆయన విడివిడిగా సమావేశం కానున్నారు. అనంతరం శనివారం జిల్లా పరిధిలోని నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

రెన్యూవల్ చేసుకోండి

తిరుపతి అర్బన్: జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన పథకాల లబ్ధిదారులు రెన్యూవల్ చేసుకోవాలని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ పథకాల ద్వారా 60 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు 40 వేల మంది మాత్రమే రెన్యూవల్ చేయించుకున్నట్టు వెల్లడించారు. సంబంధిత విద్యార్థులు ఆయా కళాశాలల యాజమాన్యాన్ని సంప్రదించి రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. అక్టోబర్‌లో జగనన్న వసతి దీవెన, నవంబర్‌లో జగనన్న విద్యాదీవెన పథకాల ద్వారా విద్యార్థులకు లబ్ధిచేకూరనుందని ఆయన పేర్కొన్నారు.

రబీకి ఎరువులు సిద్ధం

తిరుపతి అర్బన్: రబీకి జిల్లాలో 83వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1 నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ క్రమంలో రబీ సీజన్‌లో వరి పంట 1.8 లక్షల ఎకరాలు సాగు చేయడానికి రైతులు దుక్కి దున్నుతున్నట్టు తమ వద్ద లెక్కలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో యూరియా 37వేలు, డీఏపీ 5 వేలు, ఎంవోపీ 8వేలు, కాంప్లెక్స్ 29వేలు, ఎస్ఎస్‌పీ 4 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా.. అందులో ఇప్పటికే 4 వేల మెట్రిక్ టన్నులు ఆయా సచివాలయ పరిధిలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు చేర్చామన్నారు. ప్రైవేటు డీలర్లు ఎరువలను నిల్వ చేసి కృత్రిక కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వరి విత్తనాలకు సంబంధించి మార్కెట్‌లో ప్రస్తుతం బీపీటీలు–5204, కేఎస్ఎం–1568, ఆర్ఎన్ఆర్–15048కి చెందిన వరి వంగడాలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు.

మదికలవరం

- చిత్తూరు జిల్లా, గుడిపాల మండలానికి చెందిన నారాయణమూర్తి గుడిపాల పంచాయతీ సర్పంచ్. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. రెండు నెలల క్రితం ఈయనకు ఉన్నట్టుండి గుండె పోటు వచ్చింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం చిత్తూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సీఎంసీకి రెఫర్ చేశారు. అక్కడికెళ్లేలోపే మరణించినట్లు కుటుంబీకులు బోరుమంటున్నారు.
- తిరుపతి నగరానికి చెందిన యుగంధర్(41) ప్రయివేటు కంపెనీ ఉద్యోగి. ఇతనికి భార్య, ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్నారు. గత నెలలో ఉదయం పూట ఇంట్లో పనిచేస్తున్నారు. శరీరమంతా విపరీతంగా చెమట పట్టింది. నీళ్లు సరిగా తాకపోవడం వల్ల అనుకుని నిర్లక్ష్యం చేశాడు. ఆపై గుండె నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయినట్టు అక్కడి డాక్టర్లు నిర్ధారించారు. అంతకుముందు కనీసం బీపీ, షుగర్ వంటి సమస్యలు కూడా లేవని.. కేవలం పని ఒత్తిడి వల్లే రాత్రుల్లో సరిగా నిద్రపోక ఇబ్బందిపడేవారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



హృదయాన్ని ఎంత భద్రంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యంగా ఉండవచ్చు. కానీ మారుతున్న జీవనశైలి, యాంత్రిక జీవనం, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, సమయ పాలనలేని ఆహారం, శరీర బరువుపై అదుపు కోల్పోవడం, వైద్య పరీక్షలను నిర్లక్ష్యం చేయడం వల్ల గుండె సమస్యలు అధికమవుతున్నాయి. వీటితో పాటు మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయ సమస్యలూ గుండెను కోలుకోనీయకుండా చేస్తున్నాయి. గుండె నాళాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ దెబ్బతీస్తున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా మనిషి ప్రాణాలను బలి తీస్తున్నాయి. వారిపైనే ఆధారపడ్డ కుటుంబీకులను వీధిన పడేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో గుండెను భద్రంగా ఉంచుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు హార్ట్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న గుండె పోటు బాధితులు
- 25 ఏళ్లకే హార్ట్‌స్ట్రోక్‌కు గురవుతున్న యువకులు
- మారిన ఆహార నియమాలు, అలవాట్ల తోనే ముప్పు
- శారీరకశ్రమ లేకపోవడం, పని ఒత్తిడే కారణం
- ఏటా 10–20 శాతం పెరుగుతున్న వైనం
- నేడు వరల్డ్ హార్ట్ డే

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లాలో సుమారు 46 లక్షల మంది జనాభా ఉన్నారు. గత ఏడాది ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 42 లక్షల మందిని పరీక్షించారు. అందులో 12,02,431 మంది మధుమేహం, 1,96,772 మంది రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. బీపీ, షుగర్ రెండూ ఉన్నవారు సుమారు 80 వేల మంది వరకు ఉన్నారు. అలాగే 12 వేల మంది గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. అవగాహన లేమితో చాలామంది చికిత్సకు దూరంగా ఉంటూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు.

కోవిడ్‌తో అల్లకల్లోలం

కోవిడ్ తర్వాత గుండె సంబంధిత చికిత్సల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందులో మగవారు 22శాతం, మహిళలు 13 శాతం మంది ఉన్నారు. ప్రస్తుతం 25 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు గుండె సమస్యలతో బాధపడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే 100 రోగులలో 70 శాతం మంది గుండె సంబంధిత రోగాలతో ఇబ్బంది పడుతున్నారు.

కారణాలివే

- చదువులో, విధుల్లో తీవ్రమైన ఒత్తిడికి (స్ట్రెస్)
- స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం
- ఫాస్ట్‌ఫుడ్, రక్తంలో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం
- 20 ఏళ్లకే మధుమేహం వచ్చినా గుర్తించక పోవడం
- తల్లిదండ్రులు ఇద్దరికీ గుండె జబ్బులు ఉండడం
- వాతావరణ కాలుష్యం
- కోవిడ్ బారిన పడిన వారి రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడడం

లక్షణాలు

- గుండె పోటుకు ముందు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది
- గాలి పీల్చుకోవడం ఇబ్బందిగా మారుతుంది
- గుండెలో మంటగా ఉంటుంది
- తరచూ జలుబు, జ్వరం, దగ్గు వస్తున్నా.. అవి ఎంతకీ తగ్గకపోవడం
- గుండె భారంగా.. అసౌకర్యంగా..
- మత్తుగా, మగతగా, చెమటలు ఎక్కువగా..
- తీవ్రమైన అలసట, ఒళ్లు నొప్పులు
- వికారం, ఆహారం జీర్ణం కాకపోవడం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు
- కాళ్లు, పాదాలు, మడతలు ఉబ్బుతాయి
- శరీరం పైభాగం నుంచి ఎడమ చేతికింద వరకు నొప్పిగా అనిపిస్తుంది

గుండె జబ్బులు...రకాలు

గుండె జబ్బులు మూడు రకాలు. కంజినెటల్ (పుట్టుకతో వచ్చేవి) హార్ట్ డిసీజ్, రుమాటిక్ హార్ట్ డిసీజ్, కరొనరీ ఆర్టరీ డిసీజ్. అయితే, ప్రతి వంద గుండె జబ్బుల్లో 90 కరొనరీ ఆర్టరీ డిసీజ్‌లే ఉంటున్నాయి. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే వ్యవస్థలో అడ్డంకులు ఏర్పడితే దాన్ని ఆర్టరీ డిసీజ్‌గా పేర్కొంటారు. దీనివల్ల గుండెకు ఆక్సిజన్, పోషక పదార్థాల సరఫరా నిలిచిపోయి కండరాలు చచ్చుబడిపోతాయి. దీన్నే హార్ట్ ఎటాక్, మయో కార్డియల్ ఇంఫ్రెక్షన్‌గా పిలుస్తుంటారు.



ఏంచేయాలంటే

- జీవనశైలిని మార్చుకోవాలి
- పనిలో ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి
- యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి సారించాలి
- రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్న వారు వయస్సు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్ట్ చెకప్ తరచూ చేయించుకోవాలి.
- ఆరోగ్యకమైన ఆహారం తీసుకోవాలి.
- ఫాస్ట్‌ఫుడ్, నూనె ఎక్కువగా వినియోగించిన ఆహారం తీసుకోరాదు.

ఉమ్మడి జిల్లాలో గుండె జబ్బుల ఓపీలు

నెల	ఓపీల సంఖ్య
మే	6,735
జూన్	7,102
జూలై	6,934
ఆగస్టు	8,002
సెప్టెంబర్	7,065

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రులు	2
టీచింగ్ ఆస్పత్రులు	2
పీహెచ్‌సీలు	104
సీహెచ్‌సీలు	17
ఏరియా ఆస్పత్రులు	5
ప్రైవేటు హాస్పిటళ్లు	2 వేలకు పైగా

ఆరోగ్య నియమాలు పాటించాలి



కోవిడ్ వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరిగాయి. గతంలో అధిక కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, మద్యం, సిగరెట్ వల్ల సమస్య ఉండేది. ఇప్పుడు ఊబకాయం పెరిగి చిన్న వయస్సులోనే గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. ఉద్యోగులు పనులు పూర్తి చేసుకొని ఎలాంటి వ్యాయామం లేకుండా నిద్రపోవడం వల్ల తెలియకుండానే కొవ్వు పెరిగి రక్తంలో బ్లాక్స్ ఏర్పడుతాయి. దీంతో గుండె, మెదడు స్ట్రోక్ వస్తోంది. రోజూ 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

– డాక్టర్ నాగరాజ్‌కుమార్, గుండె వైద్య నిపుణులు

జ్వలించే నిప్పుకణిక భగత్ సింగ్



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'భారతదేశ స్వాతంత్ర్య సమరంలో వాళ్లు నన్ను చంపవచ్చు.. కానీ వారు నా ఆలోచనలను చంపలేరు. నా శరీరాన్ని దహించ గలరు.. నా ఆత్మను దహించలేరు' అన్న మాటలతో యువతలో పోరాట పటిమను రగిల్చి జ్వలించే నిప్పు కణికలా భగత్ సింగ్ మారారని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొనియాడారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా గురువారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి సమీపంలోని రామానాయుడు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భగత్‌సింగ్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోరాట పటిమను ఈతరం యువత స్ఫూర్తిగా తీసుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం పయనించాలని సూచించారు. ఈ వేడుకల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1న శ్రమదానం

తిరుపతి అర్బన్: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో అక్టోబర్ 1వ తేదీన శ్రమదానం నిర్వహించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకుని శ్రమదానం నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అందరు ఎంపీడీఓలు, డీఎల్‌పీఓలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శివశివమూర్తివి గణనాథా..

- అధికార నందిపై దేవదేవేరుల విహారం
- గణనాథుని ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో వేద స్వదశం పాల్గొన్న ప్రముఖ దేవాలయాల నుంచి విచ్చేసిన పండితులు

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రత్యేక ఉత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు స్వామివారికి 14 గ్రామాలకు చెందిన వారు ఉభయదారులుగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. రోజుకో వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తారు. గురువారం అధికార నంది వాహనంపై భక్తులను అనుగ్రహించారు.

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిగాయి. బుధవారం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల అనంతరం ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉత్సవాలు జరగడం సంప్రదాయం. ఆమేరకు గురువారం ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున మూలస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి ఆలయ అధికారులు, ఉభయదారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లి అధికార నంది వాహనంపై కొలువుదీర్చగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. అలాగే ఆలయంలో వేద స్వదశం కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఉభయదారులుగా కాణిపాకానికి చెందిన వళ్లువర్ వంశస్తులు వ్యవహరించారు.

నాలుగేళ్లలోనే 30 ఏళ్ల అభివృద్ధి

పుంగనూరు నియోజకవర్గంలో 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేపట్టినట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పుంగనూరు నియోజకవర్గ ప్రజలపై ముఖ్యమంత్రి ఎంతో ప్రేమతో ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందించే పనులు మంజూరు చేశారని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గురువారం పుంగనూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప పాల్గొని ప్రారంభించారు. సింగిరి గుంట సభలో మంత్రి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కడప జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి రూ.2800 కోట్లతో పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీరు అందిస్తామన్నారు.

- పుంగనూరు నియోజకవర్గంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- రూ.2800 కోట్లతో గండికోట నుంచి పైపులైను
- ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- పలు ప్రారంభోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సింగిగుంటలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పడమటి నియోజకవర్గాలకు తాగునీరు–సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. సింగిరిగుంట సభలో మంత్రి మాట్లాడుతూ రూ.1500 కోట్లతో మూడు రిజర్వాయర్లను సీఎం మంజూరు చేశారని తెలిపారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల ద్వారా పడమటి నియోజకవర్గాలలో కరువును పారదోలి, సస్యశ్యామలం చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. చంద్రబాబు అండ్‌కో నీచబుద్ధితో రిజర్వాయర్లపై స్టేలు తెచ్చి పనులు ఆపివేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఎన్నికల లోపు రిజర్వాయర్లు పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామన్నారు. పుంగనూరులో 30 సంవత్సరాలుగా ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఉన్న వారు ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పుంగనూరు అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను చూసి ఆయనకు అండగా నిలవాలని కోరారు.

సున్నావడ్డీ రుణాలు పంపిణీ...

మండలంలోని 23 పంచాయతీల్లోని 1,325 మహిళా సంఘాలకు మంత్రి పెద్దిరెడ్డి సున్నావడ్డీ రుణాల కింద రూ.1.52 కోట్లు చెక్కు పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుంటూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి కోరారు.

రైతులకు పరికరాల అందజేత

డ్వామా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 2,573 మంది రైతులకు రూ.4.83 కోట్లతో మంజూరైన వ్యవసాయ పరికరాలను మంత్రి పెద్దిరెడ్డి పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నా రని తెలిపారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, ఏపీడీ ఉమావాణి పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ బృహత్తర కార్యక్రమం

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలతో బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి ధరల స్థిరీకరణనిధికి రూ.3వేల కోట్లు కేటాయించారని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. పాలెంపల్లెలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంటలకు గిట్టుబాట ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎరువులు, విత్తనాలు, రైతులకు సలహాలు, సూచనలు రైతుభరోసా కేంద్రాల నుంచి అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజల ముంగిటకే సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 2 వేల జనాభాకో సచివాలయాన్ని ఏర్పాటు చేసి, వలంటీర్ల ద్వారా ప్రజలకు సేవలు అందింస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల వారికే సంక్షేమ పథకాలు అందాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదరికమే ప్రామాణికంగా పథకాలు సచివాలయాల ద్వారా పారదర్శకంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



సున్నావడ్డీ రుణాలు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రతి గడపలో సంతోషం



గడపగడపకు మహాపాదయాత్రలో మోహిత్‌రెడ్డితో కలిసి నడుస్తున్న ప్రజలు

పాకాల: ప్రస్తుతం ప్రతి గడపలో సంక్షేమం, సంతోషం చూస్తున్నామని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీలో ఆయన గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం తుడా చైర్మన్ ఉప్పరపల్లి పంచాయతీలోని వేమనఇండ్లు, మల్లెలచెరువు, మల్లెలచెరువు దళితవాడ, పచ్చిపాలఇండ్లు, నగిరి ఇండ్లు, గుమ్మడివారిఇండ్లు గ్రామాల్లో విస్తృత్యంగా పర్యటించారు. సమస్యలడిగి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఊట్లవారిపల్లికి చెందిన గణేష్ ఆచారి తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు మోహిత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, పట్టాభిరెడ్డి, మునిరత్నంరెడ్డి, రఘుపతి, భాస్కర్‌నాయుడు, అన్నాబాబు, నాగూర్, రహీం, గిరిప్రసాద్‌రెడ్డి, బాబురెడ్డి, సునీత, శ్యామలా, సురేష్, అమృత, మధు, బాలశంకర్, వెంకటరమణ, వనజ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన గణేష్ ఆచారి

జిల్లాకు చేరిన ఎన్నికల సామగ్రి



బ్యాలెట్ యూనిట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట: ఎన్నికల సామగ్రి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు బెంగళూరు బెల్ కంపెనీ నుంచి ప్రత్యేక వాహనంలో రేణిగుంట పాత ఎయిర్‌పోర్ట్ మార్గంలోని సీడబ్ల్యూసీ గోడౌన్‌కు చేరుకున్నాయి. గురువారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్డీసీ శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు గోడౌన్‌కు చేరుకుని వాటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాకు 6,780 బ్యాలెట్ యూనిట్లు, 4,270 కంట్రోల్ యూనిట్లు చేరాయన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌ను తెరచి, వాటిని భద్రపరిచినట్లు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సీడబ్ల్యూసీ గోడౌన్ మేనేజర్ రమేష్‌బాబు, ఎన్నికల తహసీల్దార్ సురేష్, రేణిగుంట డీటీ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని గాంధీమందిరం వద్ద గురువారం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 72 ప్లాస్టిక్ సంచుల్లోని 3,510 కిలోల బియ్యం ఉన్నట్లు వెల్లడించారు. వీటి విలువ రూ.1,29,870 ఉంటుందన్నారు. ఏపీ 39 యుఎం 1704 నంబర్‌గల వాహనంలో తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితులు శీనయ్య, డ్రైవర్ శివను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. దాడుల్లో విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్, సీఎస్‌డీటీ ఓబయ్య పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,760
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,385
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,300
రిటైల్ వెండి గ్రాము	రూ.74.30

యువకుడికి కత్తిపోట్లు

గూడూరు రూరల్: పట్టణంలోని నాయుడుకాలువ కట్ట ప్రాంతానికి చెందిన కొండాపురం వెంకట చైతన్య అలియాస్ చింటుపై రెండో పట్టణానికి చెందిన రాజు, చిన్న, జయ, మరికొందరు కలిసి కత్తితో దాడి చేసినట్లు సీఐ హజరత్‌బాబు తెలిపారు. వినాయక నిమజ్జ కార్యక్రమంలో భాగంగా డీజే వద్ద జరిగిన ఘర్షణలో పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని వెంకట చైతన్యపై దాడిచేశారన్నారు. ఈమేరకు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాచిన వంటలు.. కుళ్లిన మాంసం

- నగరంలోని హోటల్‌లో వెలుగు చూసిన వైనం
- చర్యలు తీసుకుంటామన్న అధికారులు

తిరుపతి తుడా: ఫుడ్ సేఫ్టీ, ప్రజారోగ్యశాఖ అధికారులు తిరుపతి నగరంలోని ప్రైవేట్ హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన ప్రతిసారీ ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగుచూస్తున్నాయి. స్థానిక లక్ష్మీపురం కూడలి సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక వైపు ఉన్న ఓల్డ్ టౌన్ హోటల్‌పై ఫిర్యాదులు రావడంతో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గది, పరిసర ప్రాంతాలు, ఫ్రిజ్‌లలో పాచిన ఆహార పదార్థాలు, కుళ్లిన మాంసం, నాణ్యతలేని కూరగాయలను గుర్తించారు. నిల్వ ఉన్న మాంసాన్ని శాంపుల్స్‌కు తీసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ మీడియాతో మాట్లాడుతూ హోటల్ నుంచి మటన్ ఆర్డర్ చేయగా అందులో దుర్వాసన వచ్చిందని ఒక వ్యక్తి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. అతనికి వాంతులు కావడంతో రుయాలో చికిత్స తీసుకున్నారని చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఓల్డ్ టౌన్ హోటల్‌పై దాడులు చేశామన్నారు. ఇందులో నాణ్యతలేని, నిల్వ ఉన్న చికెన్, మటన్‌ను గుర్తించామన్నారు. శాంపిల్స్ సేకరించామని, ల్యాబ్‌కు పంపించి నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు. నాణ్యత, కిచెన్ పరిశుభ్రంగా లేనందున వారికి భారీ జరిమానా విధించామని చెప్పారు. తిరుపతికి నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తుంటారని, వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్ యజమానులపై ఉందన్నారు. ప్రైవేట్ హోటళ్లపై నిరంతరం దాడులు చేస్తామని, అపరిశుభ్రంగా ఉన్నా, నాణ్యతలేని వంటకాలు అందిస్తున్నా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, ఫుడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలు పాల్గొన్నారు.



ఓల్డ్ టౌన్ హోటల్లో తనిఖీలు చేస్తున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, సిబ్బంది

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,336 మంది స్వామివారిని దర్శించుకోగా.. 25,857 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

హరిత విప్లవ పితామహుడి మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు

- వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ సంతాపం



డాక్టర్ శారద విజయలక్ష్మి
వీసీ ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం

తిరుపతి సిటీ: దేశంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతులను రారాజును చేయాలన్న దృఢ సంకల్పంతో అను నిత్యం శ్రమించిన వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు అని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మి పేర్కొన్నారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, వ్యవసాయ శాస్త్రవేత్త అయిన స్వామినాథన్(98) గురువారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ ద్రిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ఆయన ఎంతో కృషిచేశారని కొనియాడారు. రైతుకు గిట్టుబాటు ధర కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని నడిపించారన్నారు. అనేక సంస్కరణలకు ఆయన మూలకర్త అని అన్నారు.

గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్

నాయుడుపేట టౌన్: ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో ఇద్దరు వ్యక్తులు ఎవరికీ అనుమానం రాకుండా ప్రయాణికులు మాదిరిగా రెండు బ్యాగుల్లో గంజాయి నింపుకుని అక్రమంగా తరలిస్తుండగా నాయుడుపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే 10.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలోలో ఇద్దరు నిందితులను హాజరుపరిచి వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు పట్టణానికి చెందిన ఎస్.చేతన్, ఎం.సైఫూల్లా, సుధాకర్ జల్సాలకు అలవాటుపడి గత రెండేళ్ల నుంచి వైజాగ్ నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తూ బెంగళూరుకు తీసుకెళ్లి విక్రయాలు జరుపుతున్నారు. ఈక్రమంలోచేతన్, సైఫూల్లా వైజాగ్‌కు వెళ్లి అక్కడ ఓ వ్యక్తిని కలిసి అతని వద్ద 10 కేజీలకు పైగా గంజాయి కొనుగోలు చేసి రెండు బ్యాగుల్లో నింపుకుని వైజాగ్ నుంచి విజయవాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో ఓజిలి క్రాస్ రోడ్డు వద్ద వస్తుండగా గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. వారివద్ద ఉన్న గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఓ.ప్రతాప్ కుమార్, పోలీసులు పీ.వెంకటేశ్వర్లు, శ్రీరాములు, రాజయ్య, డీ.వెంకటేశ్వర్లు, రాజయ్య, గోపాల్, కృష్ణ, రమణయ్య పాల్గొన్నట్లు తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

నేడు పౌర్ణమి గరుడ సేవ

తిరుమల: సెప్టెంబరు 29న తిరుమలలో పౌర్ణమి గరుడ సేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సెప్టెంబర్ 29వ తేదీ రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామి గరుడుడిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

దొరవారిసత్రం: ఫోన్‌లో భార్యతో గొడవ పడి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుకుంది. స్థానిక ఎస్‌ఐ తిరుమలరావు కథనం.. ఒడిశా రాష్ట్రం, బలేశ్వర్ జిల్లా, కంటపాడ ప్రాంతానికి చెందిన ప్రకాష్ మాలిక్(19) వారం కిందటే నెలబల్లి ప్రాంతంలోని ఓ ఫ్రైడ్‌రైస్ దుకాణంలో పని కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో గత రెండు రోజుల నుంచి అతని భార్యతో సెల్ ఫోన్‌లో గొడవ పడుతున్నట్టు స్థానికులు గుర్తించారు. మంగళవారం సాయంత్రం భార్యతో తీవ్రంగా గొడవపడి మనస్తాపానికి గురయ్యాడు. ఆపై ఎవరూలేని సమయంలో అతను ఉంటున్న గదిలో రేకులు ఉన్న పైపులకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కర్ణాటక మద్యం సీజ్.. ఇద్దరి అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ జోగేంద్ర కథనం మేరకు.. నగరంలోని సంతపేటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్‌ఈబీ పోలీసులకు సమాచారం అందింది. సీఐ, ఎస్‌ఐలు బాబు, రామ్‌ప్రసాద్ సిబ్బంది కలిసి సంతపేటలో తనిఖీలు నిర్వహించారు. దొంగలబావివీధికి చెందిన పరదేశి కుమారులైన పి.కుట్టి (26), పి.రఘు (24) కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 21 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టు చూపి, న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ సిబ్బంది శంకరనాయక్, జయశంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ బస్సు డ్రైవర్లకు టికెట్‌పై కమీషన్



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: విద్యుత్ బస్సుల డ్రైవర్లకు టిమ్ మెషిన్లు పంపిణీ చేయడంతోపాటు ఒక్కో టికెట్‌కు రూ.2 నుంచి రూ.4 వరకు కమీషన్ ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో పలు బస్సు సర్వీసులను తనిఖీలు చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి అలిపిరి డిపో కేంద్రంగా 100 విద్యుత్ బస్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిలో 50 సర్వీసులు తిరుమల కొండకు, 14 సర్వీసులు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు, 12 సర్వీసులు నెల్లూరుకు, 12 సర్వీసులు కడపకు, 12 సర్వీసులు మదనపల్లికి నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నట్లు చెప్పారు. కడప, మదనపల్లి మార్గాల్లో ముఖ్యమైన నాలుగు, ఐదుచోట్ల స్టాపింగ్ పెట్టాలని పలువురు ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఆయా మార్గాల్లో స్టాపింగ్ ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ బస్సుల డ్రైవర్లకు టికెట్లు కొట్టడానికి టిమ్ మెషిన్లు అందజేస్తామని వెల్లడించారు. వారికి టికెట్‌కు కమీషన్ కూడా ఇస్తామన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అనుమతి వచ్చిన వెంటనే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్, ఏడీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి,అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకులు



క్షేత్రోత్సవంలో స్వామి, అమ్మవార్లు



ఘనంగా వాసుదేవకుండ హోమం

పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి వాసుదేవకుండ హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి అలంకార మండపంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని శేష వాహనంపై కొలువుదీర్చి పవిత్రాలను సమర్పించారు. వేద దివ్య ప్రబంధ పారాయణం, హోమం, నివేదన, శాత్తుమొర నేత్రపర్వంగా జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొని తరించారు. సాయంత్రం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుదీర్చి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

- రాపూరు